
# కిరాయి బండి

పి.వి. రమణ



**అవును.** ఇప్పటికీ రంగనాథానికి ఆవేదనగానూ ఆశ్చర్యంగానూ ఉంటుంది. అంతకు మించిన ఏదో ఎలితి గుండెల్ని తొలిచివేస్తూ ఉంటుంది. ఇప్పటి కిప్పుడే తన జీవితంలోని అయిదు దశాబ్దాల అమూల్య జీవనసారాన్ని కాలం కబళించింది. కాలం ఎంత కనికరంలేనిది! ఎంత కఠోరమైంది. ఈ సుదీర్ఘ కాలంలో తన బ్రతుకులో వసంతాలు విప్పుతూ కాలం పాడిన ఒక్క జోలపాట! కనీసం ఒక్క జాలి పాట! అగాధ లోయల ప్రతిధ్వనించే తన బాధల పల్లవి నైరాశ్య స్పందనలు, అంతరాంతరాల్లో నిరంతరం సుళ్లు తిరిగే విషాద చింతనలు. ఏ ఒక్క మధురానుభూతి స్వర్ణమాత్రంగా తన్ను సేద దీర్చబోయినా, అంతకు మించిన దైన్యం ఆ అనుభూతిని తన్నుకు పోయేది. "సార్థకతలేని బ్రతుకు, తహతహ చచ్చిపోయి దిష్టిబొమ్మలా మిగిలిపోయిన తను కాలం ఎంత అమానుషంగా వేసింది కాటు తనను ఆటబొమ్మలా ఆడింది ఎంత వినోదించింది" అద్దంలో తన ప్రతిబింబాన్ని చూస్తూ గొణుక్కున్నాడు రంగనాథం.

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. అది గూడా కాలానికి పరిచర్య చేసేందుకు నియమింపబడ్డ ఒక బంటు అన్నంత ఉక్రోషంగా చూశాడు గడియారంవైపు. మనిషిని నడిపించి, శాసించగల శక్తి నాకుంది అన్నట్లు గోడ మధ్యన తిష్టవేసిన దానివైపు అసహనంగా చూశాడు. ఆ గడియారం సూటిగా తన గుండెమీదనే గంటలు మ్రోగిస్తూ తన ప్రతాపాన్ని వెల్లడి చేసుకుంటున్నదన్నంత ఆక్రోశంతో చూశాడు.

"ఆఫీసుకు పోరా ఈరోజు!?" లోనుంచి ప్రశ్నిస్తూనే వచ్చింది భార్య అనంతమ్మ.

ఆమెవైపు విస్మయంగా చూశాడు రంగనాథం. భయం భయంగా చూశాడు. నీరసం నిండిన దేహం, నిశీథిలో కొబ్బరి మట్టల దిగ్బంధనాన్ని ఛేదించుకొని నేలమీదకు చేరిన వెన్నెల శకలాల్లా జుట్టు, సంవత్సరాల తరబడి వర్షాలకు కరువాచి బీటలువారిన పొలంలా ముడతలతో నిండిన మొహం జీవితం ఇచ్చిన శాపంతో, పరితాపంతో కాగి కాగి ఉబ్బి బయటకు వచ్చిన నరాలు రంగనాథం మనసు వ్యగ్రమైంది. ఆమెనే తేరిపార జూస్తూ ఉండిపోయాడు. తన్ను మధురానుభూతుల్లో ముంచివేసిన మనోహర దృశ్య సంకేతాలు ఆమె నుండి ఏ ఎడారుల్లోకి వెళ్ళిపోయినై? తన్ను గుంజి నిలిచి నిలిపేసే అయస్కాంత శక్తి ఆమె కళ్ళనుండి ఎటు అదృశ్యమైంది? ఇప్పుడవి ఒట్టి గాజు గోళాలు, తుమ్మెద రెక్కల్లా నిగనిగలతో నిండిన ఆనాటి ఆమె శిరోజాలు ఇప్పుడు చిక్కుపడి ఉండగట్టిన నారపీచు. ఎండా, వానా దెబ్బలకు చీలికలు పేలికలైన దిక్కుమాలిన చెట్టు బెరడులా, పగుళ్ళు తాలూకు చారలతో ఆమె శరీరం—వయసు ఆమెను లొంగదీసుకొంది, వృద్ధాప్యం ఆమెమీద ఆధిపత్యం చెలాయిస్తున్నది. "బ్రతుకంటే ఒక అరగంటసేపు ఆహ్లాదపరిచే హరివిల్లు లాటిదే, ఆ రంగులు కరిగిపోతై, దాంపత్య తొలి రోజుల్లో జర్దకంగా నిద్రలేచేసరికి ద్వార బంధాలను తాకుతూ తారట్లాడే ఉదయ సూర్యకిరణాల తాత్కాలిక సముదాయంపు వంటిదే ఏ అనుభూతైనా! రంగనాథం నైరాశ్యంలో కూరుకుపోయాడు, ఒక అపరిచిత వ్యక్తిలా తనవైపే చూస్తుండిపోయిన రంగనాథం తీరుచూసి కలవరపడింది అనంతమ్మ. ఆమెకంతా అయోమయంగా ఉంది.

"అట్లా చూస్తారేమండీ...ఆఫీసుకు పోరా ఈరోజు?" మళ్ళీ ప్రశ్నించింది అనంతమ్మ యథాలాపంగా. రంగనాథం అచేతనావస్థలో మిణుకు మిణుకుమనే భావన ఒకటే. కాలం నిరంకుశమైంది. నిర్దాక్షిణ్యమైంది. పచ్చని జీవాన్ని దేవ్వి పదికాలాలుంచని బ్రహ్మరాక్షసి వంటిది కాలం. రంగనాథంలో బహిర్గతం చేయలేని అంతస్సంఘర్షణ.

"నీళ్ళుపెట్టు." అనంతమ్మ వైపు చూస్తూ పొడిపొడిగా అన్నాడు రంగనాథం. రంగనాథం వైఖరి ఆమెకు అర్థం కాలేదు. ఎన్నో సందేహాలు ఆమెలో. భర్తనుండి ఇంకా ఏదో వివరణకోసం ఆమె మనసు ఆరాటపడింది.

"ఏమిటండీ అట్లా ఉన్నారు?" ప్రశ్నించింది అనంతమ్మ. మౌనంగా, నిరామయంగా అనంతమ్మ వైపు చూశాడు రంగనాథం. ఇప్పుడు రంగనాథానికి భార్యను ముఖాముఖి చూడాలంటే

భయం. కాలం తాలూకు కఠోర సత్యాలు, అవి శరీరంపై కల్పించే వృద్ధాప్య కొలుక మచ్చలు చూడాలన్నా రంగనాథానికి చిరాకు.

"ఎట్లా ఉన్నాను?" మళ్ళీ అదే పాడి పాడి రంగనాథం ప్రశ్న.

"మామూలుగా లేరు."

"నీవు ఉన్నావా?"

నిరుత్తరులై రంగనాథం వైపు చూసిందావిడ. అలవి ప్రశ్నకు సమాధానం చెప్పటానికి ఆమెవద్ద ధైర్యం తప్ప మరేమీ లేదు. సందేహంగా ఒక్కక్షణం భర్త వైపు చూసి "సరే లేవండి" అంటూ లోనికి నడిచింది అనంతమ్మ.

రంగనాథం అద్దంముందు కూర్చొనే ఉన్నాడు. ఎదురుగా అద్దంమీద వ్యాపిస్తున్న ఎండ పొడలు, రంగనాథం మనసులో అల్లుకు పోతున్న అశాంతిక్రీడలు, నిర్హేతుకమైన, అర్థరహితమైన ఆలోచనల్తో అతని గుండె బరువెక్కిపోతున్నది. మరపు తెరల్లోకి మళ్ళించిన గతం తాలూకు చిహ్నాలు మళ్ళీ మనోరంగంమీద హఠాత్తుగా దూసుకు వచ్చిన గాలిపొరతో అద్దం మీది పొడలు మృదువుగా లాస్యం చేశాయి. రంగనాథంలో కలవరం, మంచు ముక్కలై ఆరాటపడే వాలుక, ఆ తర్వాత అనుభవంతో మొద్దుబారి పోతుంది. ఈ జీవితంలోని ఆటుపోటులు, ఆరాటాలు ఎటువంటివేనేమో. వికారాలు, నిర్వికారాలు, విచారాలు, నిర్విచారాలు, అంతరాంతరాళాలలోని వేదన, అకటావికటంగా ఒదించే ధైర్యం ఆశోపహతమైన జీవితమాధుర్యం...ఇవన్నీ యుగాల పరిభ్రమణంలో తీయని అనుభూతుల్ని ఆరగించుకొంటూ, అవ్యక్తులను నెమరువేసుకొంటూ చరమసంధ్యలో సైతం కాలానికి, దాని వేగానికి తట్టుకొని హృదయ కుడ్యాలపై నిలిచే అనుభూతి రూపాలు.

"లేవరా ఇక!" లోనుండి అనంతమ్మ కేక. అనాసక్తంగా లేచి స్నానాల గదివైపుకు నడిచాడు రంగనాథం. అయిందనిపించినట్లు స్నానం ముగించాడు. ఇహ మిగిలింది భోజనం. ఎవరో తరుముకొస్తున్నట్లు రెండు ముద్దలు నోట్లో కుక్కుకోవటం, ఆఫీసు, ఇల్లు, భోజనం, పడక, ఇదొక రొటీన్ పరిధిలో భ్రమించే చక్రం. ఆ చక్రం పట్టుకొని పల్టీలు వేసేదే జీవితం.

ఆఫీసుకు పోవటమంటే చిరాగ్గా ఉంది రంగనాథానికి. అంతకుమించి అనాసక్తంగానూ ఉంది. తన రూంలో కొచ్చి భార్యను కేకేశాడు, అద్దం ముందు కూర్చొని తన రూపాన్ని మళ్ళీ చూసుకున్నాడు. కుమ్మరి పురుగులా తన శరీరాన్ని తొల్చివేసింది కాలం. సరుగుతోటను వృథాగా చీలుస్తూ పోయే గాలిహోరులా, తన్నూ నిలువునా కంపింపజేసే వేదన, పొగమంచులా పొడగట్టే జీవితాభాస. సుఖ దుఃఖాల నిమ్నోన్నతాలు, ఆరోహణ అవరోహణల ప్రయాణ, ప్చ్, 'బ్రతుకంటేనే ఒక శాపం' నిట్టూరుస్తూ అనుకొన్నాడు రంగనాథం. అర్థంలేని జీవితం సంధికాలంలో తన్ను కొంటున్నట్లు గొణుక్కుంటూ తన చేతుల వైపు చూసుకొన్నాడు రంగనాథం. వాటిల్లో జీవశక్తి ఇగిరిపోయింది. ఎండుకుపోతున్న రక్తనాళాలు. కరెన్సీ విలువ కోల్పోయిన ఒట్టి రంగు కాగితం ముక్కలా తను. శిథిలమైన అతిథిశాలలా తన జీవితం. ఈ అలాములు పలాములు బ్రతుకులోనే క్షణం మెరిసే మెరుపు తీగల్లా ఏవో స్మృతుల గలగలలు. ఆ గలగలలే తనకు కొత్త వూపిరి. వర్తమానానికి పులకరింతల వారధి.

"ఏమిటి పిల్చారు?" వస్తూనే అడిగింది అనంతమ్మ.

"ఈరోజు ఆఫీసుకు పోను." గంభీరంగా అన్నాడు రంగనాథం. చిత్రంగా చూస్తూ ప్రశ్నించింది అనంతమ్మ.

"ఎందుకని?"

"నా ఇష్టం?" నా వ్యక్తిత్వం నాది అని ప్రకటించేంత దృఢంగా అన్నాడు.

"ఉదయమే ఈ విషయం చెప్తే ఉరుకులు పరుగుల్తో గాక, కొంత నిదానంగా చేసే దాన్నిగా వంట." చీర కొంగుతో చేతుల తడి తుడుచుకొంటూ యథాలాపంగా అంది అనంతమ్మ.

రంగనాథానికి చిర్రెత్తుకొచ్చింది.

"ఏం ప్రతిదీ నీకు ముందే చెప్పాలని ఏమన్నా రూలుందా? నా కామాత్రం స్వేచ్ఛ లేదా? అసలు నీ బోడి వంటకోసమే కాదు కూర్చున్నానా?" తనకే స్పష్టంగాని ఉద్వేగంలో కూరుకుపోతున్నాడు రంగనాథం.

"ఏమిటో ఈ మనిషి" మనసులోనే గొణుక్కుంది అనంతమ్మ.

"అట్లా నిలబడతావేం నిట్రాడిలా. వెళ్ళి ఆ వీధి తలుపు వేసిరా."

"ఎందుకు?"

"చిందులేయటానికి." అసహనంతో అరిచినట్టు అన్నాడు రంగనాథం.

"బాగానే ఉంది సంబడం." వెళ్ళింది అనంతమ్మ.

వెళ్తున్న భార్యవేపే తదేకంగా చూస్తూ ఉండిపోయాడు రంగనాథం. అట్లా చూస్తున్న అతని మనసు లిప్తకాలం విలవిల్లాడింది భార్య యెడ తన ప్రవర్తన పట్ల.

అనురాగమున్నచోటే అధికారముంటుందేమో! కాకపోతే కట్టుకొన్న భార్యమీద తన పెత్తనమేమిటి? ఈ చిరుపురు ఆగ్రహాలే చిరస్మరణీయాలైన స్మృతులుగా మిగిలిపోతాయేమో... ఏమో" రంగనాథం మనసులో మార్దవం వెన్నెల్లా పరుచుకొంది.

అనంతమ్మ తిరిగి వచ్చింది. ప్రేమ, ఆదరణ, లాలింపు, చిరునవ్వుల కొసమెరుపుల మధ్య రంగనాథం.

"నీ కో ముఖ్యవిషయం చెప్పాలి. అడ్డు ప్రశ్న వేయకుండా చెప్పినట్టుగా చెయ్యి."

"ఏం చేయాలి" అర్థం గానట్లుగా అనంతమ్మ.

రంగనాథం అనంతమ్మవైపు నిశ్చలంగా చూస్తూ అన్నాడు.

"ప్రతి వ్యక్తికీ జీవితంలో కొన్ని అమూల్యమైన జ్ఞాపకాలుంటాయి. మీ నాన్న పుణ్యమా అని అవేవీ నాకు మిగలకుండా పోయినై."

"ఇప్పుడు మానాన్న సంగతెందుకులెండీ?" గునిసింది అనంతమ్మ.

"అబ్బో, నాన్న పేరెత్తేటప్పటికి రోషం ముంచుకొచ్చింది. ఏం మీ నాన్న నాకు చేసిన అన్యాయం తక్కువదా?"

"మీకు జరిగిన అన్యాయ మేమిటండీ."

"ఏమిటీ? నిన్ను కట్టబెట్టటం కంటే ఇ కేం కావాలి?"

అనంతమ్మ చివ్వున తలెత్తి రంగనాథం వైపు చూసింది. ఆమె కళ్ళల్లో నీటి పొర. మనసు నిండా వ్యధ.

"నా నోట్లో మాటకంటే నీ కళ్ళల్లో నీరు ముందుంటుంది."

"కాకపోతే ఏమిటండీ ... పిల్లలు ఎదిగొస్తున్నారు. ఇంతకాలానికి ఈ కాపురం మీకు వెగటు గొట్టిందా?" ఓటమితో క్రుంగిపోతూ ఆక్రోశించినట్లుగా అన్నది అనంతమ్మ.

"జీవితంలో ఏం కోల్పోయానో ఇప్పుడే తెలిసొస్తున్నది" ఏదో అందని విముక్తికోసం అల్లాడుతున్నట్లుగా అన్నాడు రంగనాథం. ఈ మనిషిలో పిచ్చి ఆలోచన లున్నాయా? అనుకొన్న ఆమె గుండె ఇచు పీచు మంది తెలియని భయంతో. విస్మయంతో అవమానంతో ఆమె ముఖం కళ తప్పింది. అశాంతిలో, అసహనంతో ఆమె నరాలు వణుకుతున్నాయి.

"పోనీ అప్పుడే చెప్పకపోయారా? నేను మీకు ఇష్టంలేనని."

పేలవమైన చూపుల్తో జీవం లేనట్లుగా అడిగింది అనంతమ్మ.

"చెప్తే పూరుకుంటాడా మీ నాన్న. మీ ఇంట్లో ఉంచుకొని, చదివించిన నేరానికి ..."

"ఆపండి. దేనికైనా హద్దూపద్దూ ఉంటుంది."

జారబోతున్న కన్నీరు అనంతమ్మలో. మూర్ఖత్వంలో కప్పుకుపోతున్న రంగనాథంలో మార్దవత, అనుబంధాల తాలూకు సందడి. అనంతమ్మను చూస్తుంటే అతని మనసు లిప్తకాలం విలవిల్లాడింది.

"ఇంతకీ నే చెప్పేది సాంతం వినకుండా అడ్డుపుల్లలు వేసి ఎదురు దెబ్బలు తీసే అలవాటు మానుకున్నావుకావు."

'ఎవరి అలవాట్లు ఎవరు మానుకున్నారు గనుక?' పూడిపోతున్న గొంతుతో అంది అనంతమ్మ.

"సరే, ఈ రాద్ధాంతాలు ఎప్పుడూ ఉండేవే. నువ్వుబోయి ఆ మూల నేల మీద కూర్చో" సాధ్యమైనంత అనునయంతో అన్నాడు రంగనాథం.

అర్థంకానట్లు రంగనాథం వైపు చూసింది అనంతమ్మ. ఆమె కళ్ళల్లో ఏవో చిరు శంకల తాలూకు ఛాయలు. మళ్ళీ వాదోపవాదాలెందుకన్నట్లుగా ఒక మూలకు పోయి గోడకు చేరగిలబడింది.

"ఇప్పుడు మనం ముప్ఫయి సంవత్సరాలు వెనక్కు పోతున్నాం. అంటే నాకు ఇరవై ఏండ్లు" అర్థమవు

లున్నదా అన్నట్లు చూశాడు అనంతమ్మ వైపు. అతని మనసు పొరలు చీల్చుకుని ముఖంపై జీరాడుతున్న అద్భుతమైన వెలుగు రేఖలు.

బంగారువాకిళ్ళవైపు అడుగు పెట్టబోతున్న స్పష్టాస్పష్టంగాని అనంతమైన తేజో కిరణాలు రంగనాధం కళ్ళముందు.

"ఇహ నీకు ... ముచటగా పదహారేండ్లు నిండాకో. అసలు నీ వయసు విషయం ఏ నాడు నిజం చెప్పావు కనుక ..." అర్ధోక్తిలో ఆగిపోయాడు రంగనాధం.

"అబద్ధాలు చెప్పి బావుకోవాల్సింది నా కేమీ లేదు." చిరు రోషంతో, చిమ్ముకొచ్చిన అభిమానం తోనూ అంది అనంతమ్మ.


"సరే, నీ వయసులోనూ నో మూప్పయి సంవత్సరాలు తగ్గించుకో. అంటే నీ విప్పుడు పైలాపచీసు పదహారేళ్ళ కన్నెపిల్లవి. కళ్యాణ గడియలకోసం కలలుగనే ముద్ద మందారం లాంటి ముద్దరాలివి."

అనంతమ్మకంతా అయోమయంగా ఉంది. కొన కంటి చూపుల్తో నలు దిక్కులు పరికించింది. "ఈ మనిషికేం కాలేదు గదా" అనుకొంటూ రంగనాధం వైపు చూస్తుండిపోయింది.

"ఏమిటట్లా వెర్రిమోహం పెడ్తావు. సూటిగా చెప్తున్నాను. ఇప్పుడిక నిన్ను చూడడానికి, వచ్చి తే ఆపై పెండ్లాడటానికి వస్తున్న అబ్బాయి నేనే. పెండ్లి చూపుల్లో ఎట్లా కూర్చుంటారో ఆడపిల్లలు అదే తీరులో కూర్చోవాలి నీవు."

రంగనాధం అంతరంగంలో అలలు అలలుగా వ్యాపిస్తున్న ఏదో వింత అనుభూతి. సరసరంలో పారవశ్య స్పందన. నడిచి నడిచి అలిసిపోయిన సుదీర్ఘ జీవన యాత్రలోని భారమైన ఘటనలన్నీ మటుమాయమై, ప్రేమ, అనుబంధం, మందహాసం, ప్రోత్సాహించే పరిహాసం, మైమరపించే మునుసిగ్గులు వసంతాలు నీటన్నింటితో కూడి వర్తమాన మంతా అమృత మయంగా అనిపిస్తున్నది రంగనాధానికి.

అనంతమ్మకు కళ్ళ ముందు అంతా శూన్యమనిపిస్తున్నది. రంగనాథం వింత వైఖరి ఆమెను కలవరపరుస్తున్నది.




"ఏమిటింకా ఆలస్యం ... పెళ్ళి చూపుల్లో కూర్చున్నట్లు కూర్చో." వేగిరపెట్టాడు రంగనాధం.

"నేనా?!" దిమ్మెర పోయింది అనంతమ్మ.

"నువ్వే ... ఏం?" దీమాగా అన్నాడు రంగనాధం.

"ఏమిటండీ ఇదంతా ... ఎవరన్నా వింటే నవ్వుతారు."

"నవ్వనీ, ఏడవనీ నా కనవసరం. నా జీవితం ఏ సరదా తీరకుండానే గడిచిపోయింది. కనీసం వివాహం ముందు ఎంతో ఆకర్షనీయంగా, రంగు రంగుల మధుర స్మృతిగా జీవితాంతం మిగిలిపోయే పెళ్ళి చూపుల ఘట్టం జరగనేలేదు నా విషయంలో. ఏం ఇప్పుడు ఆ భావన తాలూకు తీపి అనవాళ్ళ అనుభూతి కోరుకోవటం తప్పా?" రంగనాధం పలుకుల్లో స్వచ్ఛత. అంతకుమించి ఆత్మీయతాను రాగాలు కలబోసుకున్న వింత స్ఫూర్తి.

జాలిగా చూసింది అనంతమ్మ రంగనాధంవైపు. ఏ నాటి నుండో గుండెల్లో పదిగి ఉన్న ఆర్ద్రత కన్నీటి బిందువుల రూపంలో వెలికి వచ్చింది. ఇదా ఈ మనిషి బాధ' మనసులో గుణించుకొని అబ్బుర పడింది.

"నువ్వు పెళ్ళిచూపుల్లో కూర్చునట్లు కూర్చుంటే తర్వాత నా కార్యక్రమం ఆరంభిస్తాను" వేగిర పెట్టాడు రంగనాధం.

ప్రకృతికి, పరిసరాలకు అతీతంగా, అసలు పట్టనట్లుగా అనంతమ్మలోనూ ఏ మధుర భావాలు గల గల మన్నాయెూ, గుండెలో ముద్ద కట్టిన అస్పష్ట అనుభూతి స్థావరంలో చైతన్య స్వరాలు ఆలాపన చేశాయెూ అనంతమ్మ నోరు మూగపోయింది. స్థాణువులా అలా గోడవార ఆనించుకు కూర్చుంది.

"అట్లాగేనా కూర్చునేది?"

"ఇంకా ఎట్లామరి?" పరవశానుభూతిలో మూత పడి పోతున్న కను రెప్పల్ని పైకి లేపుతూ అంది ఆమె దృష్టికి ఈ దృశ్యమంతా అద్భుతంగా ఉంది. మనోలోకాల తెర మరుగున ఇంత కాలం గుప్తంగా ఉన్న అదృశ్య అనుభూతి తాలూకు తేజస్సు ఆమెను ఆపాదమస్తకం ఆక్రమించినట్లు తన్మయంగా ఉంది.

భర్త అనే అద్వితీయ అమృతమయ భావన పట్ల ఆమె మనసు కరిగే కర్పూరమే అయింది. ప్రాపంచిక బాంధవ్యాలలో సైతం బ్రహ్మానంద స్థితి పొంద వచ్చు నన్న సత్యానికి అనంతమ్మ ప్రస్తుత స్థితే సాక్షీభూతం. అనంతమ్మ పారవశ్య స్థితి రంగనాధానికి అర్థం కాలే.

"ఏమిట సగం నిద్ర బోతూ కూర్చుంటావు. అసలు ఆ నాడు నిజంగా నీకో పెళ్ళి చూపులతతంగమే ఎదురై ఉంటే తెలిసొచ్చేది. తేరగా రెడిమేడ్ సరుకులా నేనున్నానుగదా? జీవితంలో ఈ ముచ్చటకూడా తీర కుండా ఏకంగా తాళిబొట్టు కట్టించారు." రంగనాధం సంపూర్ణంగా అర్థమవుతున్నాడు అనంతమ్మకు.

అతని అంతర్యం నిర్మలాకాశంలా, అతని ఆరాటాలు ఆకాశంలో కదలాడే శుభ్ర మేఘ శకలాల్లా, అతనిలోని ఉద్వేగం విసురుగా వీచే గాలిని పెనవేసుకుని తరలి వచ్చే సుగంధ పరిమళంలా. అనంతమ్మ నరాల్లో అపురూప చైతన్యం. వెన్నులో నుండి తట్టుకొచ్చే మధుర వేదన. అది సందిగ్ధమో, సంచలనమో, హృదయపు లోతుల్లో నుండి స్పందించే ఆరాధన, అభ్యర్థనల తాలూకు సంకేతమో. ఇదీ అని స్పష్టంగా వ్యక్తీకరించ లేని నిక్షిప్త చేతనా దివ్యస్ఫూర్తి అనంతమ్మలో.

"నిజమే. ఈ అచ్చటా ముచ్చటల ఆరాటంకూడ నా వల్లే ఆయనకు దక్కలేదు." గొణుక్కుంది మనసులో.

"ఏదీ అచ్చం పెళ్ళి చూపుల్లో కూర్చున్నట్లు కూర్చో. నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతాను." పరవశించే ఎదతో రంగనాధం.

అనంతమ్మ ఇంకా ఆ తన్మయత్వ ఛాయల నుండి బయట పడలేదు. ఆమె రెప్పలపై బరువుగా ప్రాకులాడే సిగ్గు లాలసత్వం.

వీధి వాకిలి ఎవరో తడుతున్న శబ్దం. ఆ ధ్వని రంగనాధం కర్ణపుటాలకు చేరువయ్యే లోపలే అతని కర్థమైంది వచ్చింది పెద్ద కొడుకు విశ్వం అని. రంగనాధం హతాశుడైనాడు. భార్యను పైకి లెమ్మని సైగ చేస్తూ వీధి వాకిలి వైపు నడిచాడు.

"అరె, అదేమిటమ్మా అట్లా గచ్చు మీద కూర్చున్నావ్—ఇన్ని కుర్చీలు పెట్టుకుని?" లోపలి కొస్తూనే ప్రశ్నించాడు విశ్వం, చేతనాచేతనాస్థితి నుండి ఇంకా తేరుకుని అనంతమ్మను.

ఈ హఠాత్సంఘటనకు ఆమె స్థాణువైపోయింది.

"ఏమిటమ్మా అట్లా చూస్తావ్. అట్లా కింద కూర్చున్నావే?" విశ్వం ప్రశ్నలో ఆరాటం.

"ప్రీగా ఉంటుందని కూర్చుంది లేరా, నీ ఆరాలూ నువ్వూ ప్రతి దానికీ." రగనాధం భార్య స్థితిని సమర్థించు కొస్తూ అన్నాడు.

రంగనాధం పట్ల ఆమెలో కలిగిన కొత్త ఆలోచనలు ఆమెకు చిత్రమైన ఉత్సాహాన్ని, కొత్త మాధుర్యాన్ని అందించినై. ఆమె మనసు సంతోష చెలమలా అయింది. పైకి కసురుకున్నా, విసుక్కున్నా నేనంటే ఆయనకు ఎంత ఇష్టమో—పిచ్చిదాన్ని తెలుసుకోలేక పోయాను. ఆమె మనసు పరవశంతో పరామర్శించు కుంది. నేత్రాలు అపూర్వ తేజస్సులో

వెలుగొందాయి, ఆమె హృదయంలో రంగు రంగుల సుందర తరంగాలు. భగవంతుడా జన్మ జన్మలకు ఈ మనిషినిడవే నా బతుకు వెళ్ళ బారేట్లు చూడు" వెలుగులు పరుచుకున్న మనసుతో అర్థించింది.

"వడ్డిస్తాను. భోజనానికి రండి" అంటూ లోని కెళ్ళింది అనంతమ్మ.

పొగన్ను వేసిన వెలుతురు అలుముకుంటున్న మసక చీకటి. డాబా మీద పిట్ట గోడకు మోచేతులు తాడించి అమరి కూర్చున్నాడు కుర్చీ మీద. రోడ్ల మీది విద్యుద్దీపాలు కొత్త జీవితం లోకి వచ్చినట్లు సంబరంతో వెలిగినై. రంగనాథం వెలిగి ఆరుతూ తిరిగి వెలిగే ఒక బల్బు వంకే నిశ్చలంగా చూశాడు. తనని వెన్నంటి నట్టేటన్నీ ఏదైనా భయం కలవర పెడుతున్నదా? తన గుండెలో నలపట పెట్టే ప్రాపంచిక ప్రలోభ శక్తులు ఈ బల్బుకూ తారస పడుతున్నాయా? ఒక్కొక్కటే ఆరుతూనే ఉంది. పూర్తిగా ఆరి పోదూ, నిశ్చలంగా వెలగనూ వెలగదు. ఈ అవస దాని కెందుకో? సంధికాలంలో ఇరుతీరాల మధ్యా కొట్టుకు మిట్టుకు లాడే జీవిలా. మృత్యు భయంకర విన్యాస భయం తనకూ ఆవహిస్తున్నదా అన్న సందేహం ఆక్షణంలో రంగనాథాని కేర్పడి కదలబారి పోయాడు. గూడులోనుండి చిలక ఎగిరిపోతే పోతే ఎక్కడకు పోతుంది? మహా చైతన్యంలో తానూ ఒక చైతన్య చిరురేఖలా—విస్మృత నిరానంద మహా శూన్యంలోకి తనూ ఒక శూన్యంలా. ఇక్కడ ఈ లోకంలో క్షోభలో మగ్గేకన్నా ఆ శూన్యమే నయం. ఈ జనన మరణాల చక్రం కొంతకాలం ఆగి పోకూడదా! ఈ అనంతమైన, అవిరతమైన కాలం తిరుగుడుకు అలుపు రాదా, ఈ దిగుడు బావి చీకటి సృష్టి లోకి ఎంత కళ్ళు విప్పుకుని చూసినా అశోప హాతమే.

క్రింద రోడ్డుమీద లాగుడు బండిని గుంజుకు పోతున్న వ్యక్తి వైపు చూశాడు రంగనాథం. ఈ బండిని లాగే శ్రమ, విసుగు అతని కేమాత్రం అంట నంత అతి సాధారణంగా లాక్కుపోతున్నాడుబండి ని. ఒకటి జడం, మరొకటి చైతన్యం. ఇక్కడ చైతన్యానికి జడం జీవిక అవుతున్నది. బండి ఖాళీగానే ఉంది. అయినా, ఆ బండిచేసే కిర్రు కిర్రు శబ్దం శ్రవణ కఠోరంగా ఉంది. బరువును మోసీ మోసీ దాని కీళ్ళు సడలి, ఒళ్ళు హూనమై వెలువడుతున్న శబ్దమది. ఇప్పుడు బరువు లేకపోయినా, ఆ కిర్రు శబ్దం దాన్ని అంటిపెట్టుకొనే ఉంది. రంగనాథం లోనూ ఏదో అలజడి, అశాంతి ఆకస్మాత్తుగా ఆవ హించింది. ప్రకృతి ఎంత సంగనాచిలా తన మీద దాడిచేసింది?! ఆ బండి కిర్రు శబ్దం తన జీవన పోరాట వైఫల్యంలోని దీర్ఘ నిట్టూర్పులకు సంకే తంలా ఉంది. ఇన్నేళ్ళ కుటుంబ పోషణకే తన బ్రతుకు అంటుకుపోయింది. పిల్లల పోషణా, చదువు లకే తన శక్తి హరించుకు పోయింది. ఉత్సాహ ఉబ లాటాలు కరిగిపోయాయి. అవయవాలన్ని నిర్జీవమై భవిష్యత్తు శూన్యంగా ... భయంగా ... అశాంతిగా చేదు అనుభూతితో నిండిన సుడిగుండంలా ... ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచాడు రంగనాథం. అవును తన జీవితం ఒక కిరాయి బండి. కుటుంబ బాధ్యతలు, బరువులు మోసి మోసి అది శిథిలమైంది.

"అయ్యో, అదేంటండీ వాడి పెంట్ తొడిగారు" డాబా మీదకు వస్తూనే అనంతమ్మ ప్రశ్నించింది. ఆ ప్రశ్నలో ఉద్వేగంగాని, ఉత్సుకతగానీ లేదు. అర్థం అయిన విషయాన్నే తిరిగి ప్రశ్నించినట్లుందా ప్రశ్న. రంగనాథాన్ని భర్తగానే గాక, అన్నివైపుల నుండి ఆమె అవగాహన చేసుకొంది.


రంగనాథం తనుతొడిగిన బెల్‌బాటం పెంటు వైపు చూసుకున్నాడు మౌనంగా. ఏదో ఒక చిత్రమైన అనుభూతి అతని హృదయంలో. తన భార్య తనను మరీ చిన్న పిల్లవాడి క్రింద జమకట్టిందేమో నన్న శంక అతని క్షణంలో కలగకపోలేదు.

"ఏం తొడిగితే? దీని మీద వాడి పెంట్ అని ఏమైనా ముద్రవేసి ఉంచావా?" రంగనాథం ఆక్రోశంగా అన్నాడు. అనంతమ్మ జీవితంలోని రక్తులు విరక్తులు, ఆకర్షణలు వికర్షణలకు వయసు చెప్పమన్నట్లుగా చూశాడు రంగనాథం.

"ఈ రకం పెంట్లు మీ కెంతో బాగున్నాయి. మీరు వో రెండు కుట్టించుకోరాదూ!" ప్రాధేయం పడ్డట్లుగా అనంతమ్మ.

రంగనాథం ప్రశాంతంగా అనంతమ్మ వైపు చూశాడు. ఆ చూపులో పాపం గానుగెద్దులా ఈ సంసారంలో తిరక్కొచ్చింది. ఒక్క అచ్చటాముచ్చటా ఇన్నేళ్ళ నుండి తనను అడిగిందీ లేదు ... తాను తీర్చిందీ లేదు." అనంతమ్మ తన కంటి రెప్పనంత అనుబంధం రంగనాథం హృదయంలో స్ఫురించి, శరీర మంతటా విస్తరించింది. ఆమె పట్ల తానెంత ఉదాసీనంగా, ఉపేక్షాభావంతో వ్యవహరించిందీ తెలి సొచ్చి మనసు కలుక్కుమంది.

"ఆ ... ఆ ... కుట్టించుకుంటా .. నువ్వూ నాలుగు పంజాబీ డ్రస్సులు పట్టించుకున్న నాడు" రంగనాథం ప్రతి అక్షరంలో మమతాను రాగాలు




పరిమితం కాదన్న సత్యం ఆమెకు బోధ పడింది. రంగనాథం మనసులోని తీరని కాంక్షలు అలలు అలలుగా కళ్ళ ముందు వ్యాపించి ఆమెను అల్లుకు పోతున్నాయి. అందుకా విశ్వం రెండు పెంట్లు కుట్టించమంటే ఈయన మూడు కుట్టించింది? మృదువుగా నవ్వుకుంది అనంతమ్మ. రంగనాథం మరింత ఆరాధనీయమైన వ్యక్తిగా ఆమెకు కన్పించ సాగాడు. వండి వడ్డించడం మినహా ఆయనకు తానే మంగా తోడ్పడ గల్గింది? ఆయన మనసులోని కోరికలను, అభిలాషలను కనీసం అర్థం చేసుకొనే టంత ఎత్తుకైనా తాను ఎదగలేకపోయింది. ఆవే దనతో అనంతమ్మ మనసు ఆర్ద్రమైంది. రంగనాథం వంటి అరమరికలు లేని వ్యక్తికి భార్య గావటమే తన జీవితానికి పరమార్థ మనుకొని అనంతమ్మ మనసును తేలిక పర్చుకొంది.

"ఒక్క మాట ... మీరేమీ అనుకోరంటే ..." అర్ధోక్తిలో ఆగిపోయింది అనంతమ్మ.

ప్రాణం పోసుకున్నాయి. నిండుగా నవ్వుకొంది అనంతమ్మ.

"సరే, క్రిందకు రండి. వంచుపడుతున్నది." క్రిందకు వెళ్ళింది అనంతమ్మ.

రంగనాథం మళ్ళీ ఆ బల్బువైపు చూశాడు. నిక్షేపంగా, నిశ్చలంగా వెలుగుతూంది. మనిషి ఇంతే నేమో. జీవం ఈ శరీరాన్ని విడిచి మహా జీవ వాయువులో కల్సిపోతుంది. మహా జీవవాయువు మళ్ళీ మరో రూపానికి వాయువు నింపి ప్రాణ ప్రసారం చేస్తుంది. ఇక్కడ ఆరంభదలూ అవసాన దశలూ ఈ ప్రాపంచిక రంగంలోనివే. అనంత ప్రశాంత మహా చైతన్యంలో ఇవేవీ లెక్కలోనివేకావు. ఈ ఆలోచనలు రంగనాథానికి ఎక్కడలేని శక్తి నిచ్చాయి. తనచుట్టూ వో మహా తేజో వలయం. ఆ వలయంలో తాను, ఇప్పుడు దానికి వృద్ధాప్య భావనగాని, కిరాయిబండి చింతనగాని ఎంత నిష్ప్రయోజన మైనదో తెలిసొచ్చింది. ★